క్లుప్తంగా

కలెక్టర్‌కు కె.కె.రాజు వినతి



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అభివృద్ధి పనులపై కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ధర్మానగర్ స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సమస్య పరిష్కరించాలని, జోగారావు నగర్‌లో ఇళ్ల పట్టాలు ఇప్పించాలని, ధర్మానగర్ రైల్వే ల్యాండ్ సమస్య పరిష్కరించాలని ఆయనను కోరారు. మద్రిపాలెంలో రైల్వే సమస్య, బర్మా కాలనీలో కాందిశీకులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ భవనాలు, మంజూరైన పనులు, టెండర్లు పిలిచినవి, టెండర్ల దశలో ఉన్నవి, త్వరితగతిన పూర్తి చేయాలని కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు.

తులసి మొక్కల పంపిణీ

సీతంపేట: సనాతన హిందూ సంప్రదాయంలో తులసికి విశేష స్థానముందని సాయిబాబా ఆలయ అధ్యక్షుడు పి.ఎల్.ఎస్.ఎన్.ప్రసాద్ అన్నారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని గురువారం అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద మహిళలకు తులసి మొక్కలు అందజేశారు. ఆలయ కార్యదర్శి కొణతాల రేవతీరావు మాట్లాడుతూ వరలక్ష్మి పూజ సందర్భంగా సుమారు వెయ్యి మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు హరగోపాల్ శర్మ, కమిటీ సభ్యులు మళ్ల సత్యనారాయణ, లోకేష్, సోనీ సింగ్, రమ, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నందగిరినగర్‌లో బీటీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులోని పలు ప్రాంతాల్లో రూ.1.23 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆయా అభివృద్ధి పనులు బుధవారం నుంచి వార్డులో ప్రారంభమయ్యాయి. నందగిరినగర్ కృష్ణుడు గుడి ప్రాంతంలో నిర్మిస్తున్న బీటీ రోడ్డును గురువారం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పరిశీలించారు. జీవీఎంసీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ రవణమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, వాటర్ వర్క్స్ ఏఈ రహీమ్ పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి పనులు



గాంధీనగర్‌లో రోడ్డు మొత్తం ఆక్రమించి చేపడుతున్న భవన నిర్మాణ పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లో రోడ్డు మొత్తాన్ని ఆక్రమించి యథేచ్ఛగా భవన నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణ యజమానులు రహదారి మధ్యలో ఇసుక, పిక్కతోపాటు కాంక్రీట్ మిక్సర్ మిషన్‌ను అడ్డంగా ఉంచడంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహన చోదకులు ఆ మార్గంలో ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు. గురువారం ఒక ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ అటుగా వచ్చినా.. పనులు ఆపకుండా కొనసాగించారు. రాకపోకలు సాగకుండా రహదారిని మూసివేసి మరీ పనులు చేయిస్తుండటంపై పలువురు స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

డ్రైనేజీల ఆధునికీకరణ

- కొండవాలు ప్రాంతాల్లో తీరిన సమస్య
- త్వరలోనే మిగిలిన ప్రాంతాల్లో పనులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో ప్రధానంగా శిథిలావస్థకు చేరిన డ్రైనేజీలను ఆధునికీకరించి సమస్య పరిష్కరించారు. వార్డులోని సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ ప్రాంతాల్లో కొన్ని దశాబ్దాలుగా పాత రోడ్డు, డ్రైనేజీలే ఉన్నాయి. వీటి అభివృద్ధి కోసం కార్పొరేటర్ కంపా హనోకు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. ప్రాధాన్యతా క్రమంలో ఈ పనులను పూర్తి చేస్తున్నారు. ముందుగా సత్యసాయినగర్, వరాహగిరి కాలనీల్లో గతంలో 24/7 తాగునీటి కనెక్షన్ల పనుల నిమిత్తం తవ్వి వదిలేసిన గోతులను పూరించి రోడ్లు సరిచేశారు. అనంతరం సత్యసాయి నగర్‌లో డ్రైనేజీల ఆధునికీకరణ చేపట్టి పూర్తిచేశారు. పాత వాటి స్థానంలో మరింత విశాలంగా, పెద్ద డ్రైనేజీలను నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

శ్లాబుల ఏర్పాటు అవసరం

సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ ప్రాంతాల్లో నిర్మించిన డ్రైనేజీలపైన సిమెంట్ శ్లాబులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీలను దాటి ఇళ్లకు చేరే సమయంలో ఏమాత్రం ఆదమరచినా వాటిలో పడిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ డ్రైనేజీలపై తాత్కాలికంగా చెక్కలు ఏర్పాటు చేసుకున్నారు. డ్రైనేజీలపై వెంటనే శ్లాబులు ఏర్పాటు చేయాలని నివాసులు కోరుతున్నారు. లేదంటే చిన్నపిల్లలు, వృద్ధులు వాటిని దాటి రావడం కష్టమని అంటున్నారు. వరాహగిరి కాలనీ-1, 2, సింహగిరి కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. త్వరలోనే వాటిని కూడా ప్రారంభిస్తామని జీవీఎంసీ సిబ్బంది తెలియజేస్తున్నారు.



ఓపెన్ డ్రైనేజీపై చెక్కలు ఏర్పాటు చేసుకున్న స్థానికులు



45వ వార్డు సత్యసాయినగర్‌లో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ

మారథాన్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ

సీతంపేట: దేశ స్వాతంత్ర్యానికి 76 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ నెల 14న వైజాగ్ రన్నింగ్ అసోసియేషన్ నిర్వహించిన 76 కిలోమీటర్ల అల్ట్రా మారథాన్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థి కె.వంశీకృష్ణ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా గురువారం వంశీకృష్ణను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. రేసులో నలుగురు క్రీడాకారులు పాల్గొనగా బుల్లయ్య కళాశాలలో బీఎస్సీ సెకండియర్ చదువుతున్న వంశీకృష్ణ పాల్గొన్నాడు. 14వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నోవాటెల్ వద్ద మారథాన్ ప్రారంభించి 15వ తేదీ ఉదయం 5 గంటలకు ముగించారు. వైజాగ్ రన్నింగ్ అసోసియేషన్ వంశీకృష్ణకు జ్ఞాపిక బహూకరించింది. ఈ సందర్భంగా వంశీకృష్ణకు కళాశాల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.



వంశీకృష్ణను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు కుమారాచార్యులు పాల్గొన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

సీతంపేట: చంద్రయాన్-3 విజయోత్సవం సందర్భంగా గురువారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎన్‌సీసీ అధికారి ఎం.ఎన్.వి.విశ్వనాథం ఆధ్వర్యంలో జై భారత్.. జయహో భారత్ – జై ఇస్రో.. జయహో ఇస్రో అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ జాతీయ జెండాలతో అక్కయ్యపాలెం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్మీ కమాండర్ కల్నల్ అజయ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సునంద్, ధర్మారావు, లలిత, కిషోర్, పద్మలత పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీ నరస

ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే చర్యలు

సీతమ్మధార: ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్‌ఐలు కనకరావు, తిరుపతిరావు హెచ్చరించారు. సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార రైతుబజార్ వరకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం నేపథ్యంలో రైతుబజార్ ఆవరణలో నిలిపిన వాహనాలను క్లియర్ చేశారు. రోడ్డుకు ఇరువైపులా పార్క్‌చేసిన వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ రోడ్డు మధ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలను నిలిపివేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. పలువురు వాహనదారులకు అవగాహన కల్పించారు.



సీతమ్మధార రైతుబజార్ వద్ద ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న పోలీసులు

సెప్టెంబర్ 10న ప్రతిఘటన సదస్సు

సీతమ్మధార: దళిత విముక్తి 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం నేపథ్యంలో సెప్టెంబర్ 10వ తేదీన సదస్సుతో పాటు ఊరేగింపు నిర్వహించనున్నట్లు దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలోని ఆర్‌అండ్‌బీ సమీపంలో గల అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రతిఘటనా సదస్సు, సాయంత్రం 4 గంటలకు సభాస్థలి నుంచి ఎన్‌ఏడీ కొత్త రోడ్డు వరకు ఊరేగింపు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా మాజీ యూపీఎస్సీ సభ్యులు, పూర్వ ద్రావిడ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం, ఏయూ ప్రొఫెసర్ పీడీ సత్యపాల్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్యతో పాటు పలువురు హాజరవుతారని అన్నారు. గత 25 ఏళ్లుగా దళిత విముక్తి కులనిర్మూలన, మతోన్మాదం, దళితులపై దాడులు, భూ సమస్య తదితర అంశాలపై పోరాడుతుందని తెలిపారు. బి.సన్యాసమ్మ, కె.రవి, యు.శివ, కె.కుమార్ పాల్గొన్నారు.



ప్రతిఘటన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత విముక్తి ప్రతినిధులు

చెత్త తరలింపులో సమయపాలన ముఖ్యం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలి, రైల్వేస్టేషన్ రోడ్డు, భారతీయ ఆహార గిడ్డంగి రహదారి, జ్ఞానాపురం రైల్వేస్టేషన్, బీఆర్‌టీఎస్ రహదారుల్లో చెత్త తరలించే క్లాప్ వాహనాలను గురువారం జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి చెత్త తరలింపు ప్రక్రియలో సమయ పాలన పాటించాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. పలు వీధుల్లో పర్యటించి తడిపొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు ఫ్రైడే-డ్రైడే పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్‌ఎస్‌ఎం ప్రసాద్, సూపర్‌వైజర్ అర్జున్, సచివాలయ శానటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ ప్రాంతంలో క్లాప్ వాహనాలను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

సిరిపురంలో ఆర్టీసీ పార్సిల్ కౌంటర్

బీచ్ రోడ్డు: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నట్లు సంస్థ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. వాల్తేరు డిపో ఆధ్వర్యంలో సిరిపురంలోని 900కే బస్టాప్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ పార్సిల్ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ, మద్దిలపాలెం కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో పార్సిల్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతో పార్సిల్స్‌ను ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పార్సిల్ కౌంటర్ వద్ద ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

మార్కెట్లకు శ్రావణ శోభ

- వరలక్ష్మీ వ్రతానికి మహిళలు సిద్ధం
- పూజా సామగ్రి కొనుగోలు

సీతంపేట: శ్రావణ మాసం రెండో శుక్రవారం మహిళలంతా వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. సిరి సంపదలు, అష్ట ఐశ్వర్యాలు, సౌభాగ్యాన్ని ప్రసాదించే ఈ వ్రతాన్ని ఆచరించడానికి సన్నద్ధమయ్యారు. లక్ష్మీదేవి బంగారు కాసు, చీర, జాకెట్టు, గాజులు, ఐదేసి రకాల పువ్వులు, పండ్లు, పిండి వంటలతో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ప్రతి ఇంట్లో పూజిస్తారు. ఈ శుభవేళ పూజా సామగ్రి విక్రయాలతో మార్కెట్లు కళకళలాడాయి. రామాటాకీస్, సీతంపేట, అక్కయ్యపాలెం ప్రధాన రహదారులు,, సీతమ్మధార, కంచరపాలెం, మద్రిపాలెం, నరసింహనగర్ రైతుబజార్లు, తాటిచెట్లపాలెం, మాధవధార బజార్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అమ్మవారికి ప్రీతి పాత్రమైన చామంతి, కలువ పువ్వులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. పువ్వులు, పండ్లు, కొబ్బరికాయలు, అరటిపళ్లు, తమలపాకులు, కర్పూరం, పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు, లక్ష్మీ రూపు కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ఇదే అదనుగా పువ్వులు, పండ్లతోపాటు మామిడాకుల ధరలు ఆకాశాన్నంటాయి. పెరిగిన ధరలతో ఒకటి అరా కొనుగోలు చేసి సరిపెట్టికోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు అంటున్నారు.

కిటకిటలాడిన సీతమ్మధార రైతుబజార్

సీతమ్మధార: స్థానిక రైతుబజార్ గురువారం వినియోగదారులతో కిటకిటలాడింది. వరలక్ష్మీ వ్రతానికి సంబంధించి పండ్లు, పూలు, మామిడి కొమ్మలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరిటాకులు, చెరుకు గడల వంటి పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. రైతుబజార్‌లోని ఏ స్టాల్ వద్ద చూసినా మహిళలే కనిపించారు. వినియోగదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

వినియోగదారుల సందడి

కంచరపాలెం: కంచరపాలెంలో వరలక్ష్మీ వ్రత పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. బీఆర్‌టీఎస్ రోడ్డు జనంతో కళకళలాడింది. కంచరపాలెం రైతుబజారులో మహిళలు బారులు తీరారు. బయట మార్కెట్లో ధరలు కాస్తా ఎక్కువగా ఉండటంతో రైతుబజారులో విక్రయాలు జోరుగా సాగాయి. సాయంత్రం భారీ వర్షం పడటంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. కంచరపాలెం వైజంక్షన్ నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారి వినియోగదారులతో నిండిపోయింది. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో సిబ్బంది వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.



సీతమ్మధార రైతుబజార్‌లో వినియోగదారుల కోలాహలం



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు



కంచరపాలెం కూడలిలో పూజా సామగ్రి కొంటున్న వినియోగదారులు

కిక్ బాక్సింగ్‌లో రితీష్‌కు పతకాలు



రితీష్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ జోగిరాజు

సీతంపేట: ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో ద్వారకానగర్ బీవీకే కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న రితీష్ దాస్ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఈ సందర్భంగా గురువారం రితీష్‌ను కళాశాల కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ జోగిరాజు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

జైలులో వస్తువుల వేలం వాయిదా

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఉపయోగంలో లేని వస్తువులను జైలు అధికారులు వేలం వేయనున్నారు. ఈ నెల 26న జరగాల్సిన ఈ వేలం ప్రక్రియను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసినట్టు జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. 26 మంది ఉభయదాతలు అమ్మవారికి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. భక్తులు రూ.1,000 రుసుం చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చు.

శ్రావణ మాస కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మీ పూజలు గురువారం నాటికి 8వ రోజుకు చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో 16 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణమాసం నెల రోజులు నిర్వహించే పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని, పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు.



సహస్ర తులసీదళార్చనలో సిరులతల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మద్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎన్‌ఏడీ ప్రాంతంలో నివసిస్తున్న బాదిరెడ్డి శివ వరప్రసాద్ అనే యువకుడు మధురవాడలోని ఓ కాలేజీలో ఎంబీఏ చదువుతున్నాడు. బుధవారం కళాశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలో సుమారు మధ్యాహ్నం 3.30 గంటలకు కప్పరాడ వద్దకు వచ్చేసరికి తన ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా నిలిపివేయడంతో బైకుపై వస్తున్న యువకుడు దాన్ని ఢీకొన్నాడు. దీంతో అతడి కుడి చేతికి గాయమైంది. క్షతగాత్రుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కంచరపాలెం పోలీసులు శివ వరప్రసాద్ వద్ద వివరాలు సేకరించారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడి అరెస్ట్

మద్రిపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడిని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్‌కు చెందిన దిలీప్‌కుమార్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన పి.వందన అనే యువతిని ప్రేమించాడు. పెళ్లి కూడా చేసుకుంటానన్నాడు. వారి ప్రేమను యువతి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. యువకుడి తల్లిదండ్రులు మాత్రం ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో దిలీప్‌కుమార్ పెళ్లికి నిరాకరించడంతో వందన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు నమోదు చేశారు. సదరు యువకుడిని గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య

మద్రిపాలెం: ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాడేరుకు చెందిన కృష్ణారావు(25) అనే యువకుడు కంచరపాలెం అరుంధతినగర్‌లోని తన బంధువుల ఇంట్లో నివసిస్తున్నాడు. నగరంలోని సిరిపురంలో గల ఓ వస్త్రాల దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి తల్లిదండ్రులు పాడేరులో నివసిస్తున్నారు. మృతుడి బంధువు కె.భాగ్యవతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం జరుగుతుందని పోలీసులు తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిస్థాయి దర్యాప్తులో తెలియాల్సి ఉందని చెప్పారు.

నేడు సింహగిరిపై లక్ష కుంకుమార్చన

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సింహవల్లీ తాయారు అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి సహస్ర నామార్చన నిర్వహించనున్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన కటుమూరి సతీష్

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని గురువారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కటుమూరి సతీష్‌కు వైవీ సుబ్బారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.



డిప్యూటీ మేయర్ సతీష్‌ను సత్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి